క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఇచ్చోడ, నర్సాపూర్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో అన్ని గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఇన్‌చార్జి ఏఈరాజు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మాన్కపూర్‌లో వైద్యశిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న మెడికల్ ఆఫీసర్ భీంరావ్

బజార్‌హత్నూర్: మండలంలోని మాన్కపూర్ మారుమూల గ్రామంలో శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ భీంరావ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 45 మందికి వైద్యపరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. వర్షాకాలంలో జాగ్రత్తగా ఉండాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వేడి ఆహారం మాత్రమే తీసుకోవాలని సూచించారు. ఈగలు, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రియాంక అనిల్, ఉప సర్పంచ్ గోలార్ అర్జున్, ఎంపీహెచ్‌వో సూర్యప్రకాష్, హెల్త్ అసిస్టెంట్ రమేశ్, అన్నపూర్ణ, శ్రీలత, ఆశ కార్యకర్త పాల్గొన్నారు.

రేషన్ దుకాణం ఏర్పాటు



సరుకులు తీసుకుంటున్న గ్రామస్తులు

నేరడిగొండ: మండలంలోని ఆరెపల్లి గ్రామంలో ప్రజలకు అందుబాటులో ఉండేందుకు రేషన్ దుకాణాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ప్రతినెలా రేషన్ సరుకులను తీసుకునేందుకు నాలుగు కిలో మీటర్ల దూరం వరకు వెళ్లాల్సి వచ్చేదని, ప్రస్తుతం తమ గ్రామంలోనే రేషన్ దుకాణం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రతినెలా ఇబ్బందులు పడ్డామని, ఇప్పుడు తమ గ్రామంలో రేషన్ షాపు ఏర్పాటు చేయడంతో ఆనందం ఉందన్నారు.

అక్రమంగా మొరం తరలిస్తే చర్యలు



అధికారులు సీజ్ చేసిన పొక్లెయిన్

నేరడిగొండ: అక్రమంగా మొరం తరలిస్తే చర్యలు తప్పవని గనులశాఖ ఏడీ రవీందర్ హెచ్చరించారు. గురువారం సాయంత్రం మండలంలోని కుప్టి ప్రాంతంలో అక్రమంగా మొరం తవ్వకాలు చేపడుతున్న పొక్లెయిన్‌ను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. వాహన యజమానికి శుక్రవారం రూ.50వేల జరిమానా విధించినట్లు తెలిపారు. ఏ గ్రామాల్లోనైనా మొరం తవ్వకాలు చేపడితే సమాచారం ఇవ్వాలని కోరారు. వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని, ఎంతటివారైనా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

గిరిజనశాఖ కమిషనర్‌ను కలిసిన నాయకులు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ సర్వేశ్వర్‌రెడ్డిని పీఆర్టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ సంఘం జిల్లా నాయకులు కలిసిశారు. శుక్రవారం హైదరాబాద్‌లో కమిషనర్‌ను కలిసి గిరిజన శాఖలో ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతులు జరగడం లేదన్నారు. బదిలీ షెడ్యూల్ విడుదల చేయాలని కోరినట్లు జిల్లా అధ్యక్షుడు ఆడెనూర్ సింగ్ తెలిపారు. స్పందించిన కమిషనర్ బదిలీ, పదోన్నతులు చేపట్టేందుకు సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. నాయకులు ఉమాకర్‌రెడ్డి, పర్వతి సత్యనారాయణ, మోహన్‌సింగ్, ప్రకాశ్, బాబుసింగ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వంతెన కష్టాలు..

- లోలెవల్ వంతెనలతో తప్పని తిప్పలు
- వర్షాకాలంలో రాకపోకలు బంద్
- నెరవేరని నాయకుల హామీలు



నక్కలవాడ వంతెన పైనుంచి ప్రవహిస్తున్న వరద (ఫైల్)

బోథ్: బోథ్ మండలంలోని పలు లోలెవల్ వంతెనలతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే చాలు వంతెనలపై నుంచి వాగులు ఉప్పొంగి ప్రవహిస్తాయి. దీంతో గ్రామాల నుంచి వెళ్లలేని పరిస్థితి నెలకొంటుంది. మండలంలోని ధన్నూర్(బి), నక్కలవాడ గ్రామాలను ఆనుకుని ఉన్న వాగులపై లోలెవెల్ వంతెనలు ఉండడంతో వర్షాకాలంలో బహ్య ప్రపంచంతో ప్రజలకు సంబంధాలు తెగిపోతాయి. గత కొన్నేళ్లుగా వంతెన నిర్మాణం చేపట్టాలని ఆ గ్రామస్తులు కోరుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

ప్రమాదకరంగా నక్కలవాడ వంతెన..

నక్కలవాడ గ్రామానికి వెళ్లే వంతెన ప్రమాదకరంగా మారింది. కరత్వాడ ప్రాజెక్టు వెనక వైపు గ్రామం ఉంటుంది. నక్కలవాడతో పాటు ఆదివాసీ గ్రామాలైన లక్ష్మీపూర్, కొత్తపల్లె, రేండ్లపల్లె గ్రామాలుంటాయి. ఆ గ్రామాలకు వెళ్లేందుకు గతంలో లోలెవల్ వంతెన నిర్మించారు. భారీ వర్షాలకు కరత్వాడ ప్రాజెక్టు పూర్తిగా నిండిపోవడంతో బ్యాక్ వాటర్ వంతెనపై నుంచి వరద ప్రవహిస్తోంది. దీంతో గ్రామాలకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోతున్నాయి. గత ఏడాది కురిసిన వర్షాలకు దాదాపు 20 రోజుల పాటు వంతెనపై వరద ప్రవహించింది. అలాగే మర్లపెల్లిలోని ఉన్నత పాఠశాలలకు వెళ్లాలంటే విద్యార్థులు తాడు సహాయంతోనే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

ధన్నూర్ వాగు ఉధృతి..

మండలంలోని రెవెన్యూ గ్రామమైన ధన్నూర్(బి) గ్రామాన్ని ఆనుకుని ఉన్న వాగుపై లోలెవల్ వంతెన ఉండడంతో వర్షం పడిన ప్రతిసారి వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దీంతో ధన్నూర్‌తో పాటు నాగాపూర్ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. వాగు ఉధృతి తగ్గే వరకు అక్కడే వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో వంతెన దాటే క్రమంలో చిక్కుకున్న గ్రామస్తులను పోలీసులు తాడు సహాయంతో రక్షించారు. అయితే తమకు ఎత్తైన వంతెన నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. మంత్రి సీతక్క ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన మాట ప్రకారం వంతెన నిర్మాణానికి నిధులు కేటాయించాలని విన్నవిస్తున్నారు. ఇవే కాకుండా కనుగుట్ట, కోట, గ్రామాలకు వెళ్లే దారిలో ఉన్న లో లెవల్ వంతెన స్థానంలో ప్రస్తుతం వంతెన నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ వంతెనలు సకాలంలో పూర్తి చేయాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

వంతెనలు నిర్మించాలి



నక్కలవాడ వద్ద కరత్వాడ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వంతెనపై నుంచి ప్రవహించడంతో దాటలేని పరిస్థితి నెలకొంది. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని దాటాల్సిన పరిస్థితి. గతంలో ఇద్దరు వంతెనను దాటుతున్న కొట్టుకుపోయారు. ఆదివాసీ గ్రామాలకు వెళ్లేందుకు వంతెనలు నిర్మించాలి.

– కొడప విజయ్ కుమార్, సర్పంచ్, నక్కల వాడ

బయటకు వెళ్లలేని పరిస్థితి



దన్నూర్(బి) గ్రామానికి ఆనుకుని లెవల్ వంతెన ఉండడంతో వర్షాకాలంలో వంతెనపై నుంచి వరద ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో గ్రామం నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి. నాయకులు హైలెవల్ వంతెన నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కానీ నిర్మించలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

– దామెర్ల హరీశ్‌రెడ్డి, ధన్నూర్(బి)

అలరించిన ఫ్రెషర్స్ డే



నృత్యం చేస్తున్న విద్యార్థులు

బోథ్: బోథ్ మండలంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే అలరించింది. నూతనంగా పాఠశాలలో చేరిన ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు సీనియర్లు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా వచ్చిన ఫారెస్ట్ రేంజ్ అధికారి ప్రణయ్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరాలంటే ఉన్నత లక్ష్యాలను కలిగి ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వర్ణలత, వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ మాధవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడవద్దు



అవగాహన కల్పిస్తున్న సౌజన్య

ఆదిలాబాద్‌టౌన్: తోటి విద్యార్థులపై ర్యాగింగ్ పాల్పడవద్దని డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్అండ్‌కామర్స్ డిగ్రీ కళాశాలలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం, జిల్లా న్యాయ సేవా అధికారి సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. జూలై 1 నుంచి అమలవుతున్న కొత్త చట్టాలు, భారతీయ న్యాయ సంహితపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎల్ఎస్ఏ కార్యదర్శి మాట్లాడుతూ.. చట్టాలపై ప్రతిఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలన్నారు. న్యాయ సంహిత, బేటీ బచావో, బేటీ పడావో చట్టాలను గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ యశోద, సఖీ కేంద్రం నిర్వాహకురాలు సరస్వతి, కళాశాల ప్రిన్సిపాల్ అనిత, సిబ్బంది శశికళ, కృష్ణవేణి, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

వేధిస్తే సమాచారం ఇవ్వాలి

ఆదిలాబాద్‌రూరల్: అమ్మాయిలను వేధిస్తే షీ టీంనెంబర్ 87126 59953, డయల్ 100, చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098 సమాచారం ఇవ్వాలని షీటీం సభ్యులు సత్య మోహన్, సుశీల అన్నారు. శుక్రవారం మావల మండల కేంద్రంలోని చావర అకాడమీ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు షీ టీం పని విధానం, సైబర్ నేరాల నియంత్రణకు పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సైబర్ క్రైం జరిగినట్లైతే వెంటనే 1930 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. జూలై నుంచి కొత్త చట్టాలు వచ్చాయని వాటి ప్రకారంగా నిందితులకు కఠిన శిక్షలు ఉంటాయన్నారు. ఐటీ కోర్ డీఎస్పీ హసీబుల్లా, హెచ్ఎం తోమస్ పాల్గొన్నారు.

‘పిల్లలను పనిలో పెట్టుకోవద్దు’



తనిఖీ చేస్తున్న ఆపరేషన్ ముస్కాన్ సభ్యులు

గుడిహత్నూర్: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని, పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని చైల్డ్ ప్రొటెక్షన్ ఫోరం సభ్యులు రామకృష్ణ అన్నారు. శుక్రవారం గుడిహత్నూర్ మండల కేంద్రంలోని పలు దుకాణాలు, హోటళ్లల్లో తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 0–18 ఏళ్ల బాల బాలికలంతా బడిలోనే ఉండాలని, వారిని తమ దుకాణాల్లో పనులు చేయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా పిల్లలు పని చేసినట్లు తెలిస్తే 1098 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆపరేషన్ ముస్కాన్ బందం సభ్యులు భీంరావు, లింగన్న, నాగు, భారతి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతీఒక్కరి బాధ్యత



మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు



అయ్యప్ప ఆలయం ఆవరణలో..

ఇచ్చోడ: పర్యావరణ పరిరక్షణ ప్రతీఒక్కరి బాధ్యత అని బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లూరి చంద్రశేఖర్ అన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించానల్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మడి భీంరెడ్డి, మండల కార్యదర్శి రమేశ్, నాయకులు పాండురంగ్, మల్లేశ్‌రెడ్డి, దయకుమార్‌రెడ్డి, తృప్తి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

ఇంద్రవెల్లి: ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని మాజీ జెడ్పీటీసీ ఆర్క పుష్పలత అన్నారు. శుక్రవారం శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకొని బీజేపీ ఆధ్వర్యంలో ఏమాయికుంట, గలియబాయి తండా, పిప్రి, హర్కపూర్, మచ్చాపూర్ గ్రామాల్లో మొక్కలు నాటారు. భావితరల భవిషత్ కోసం ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగు, రాథోడ్ రాధిక, రాజువర్ధన్, విజయ్‌కుమార్, పెందోర్ కృష్ణ, రాజేశ్వర్ పాల్గొన్నారు.

నేరడిగొండ: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని శుక్రవారం మండలంలో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జి వర్ధంతి కార్యక్రమంలో భాగంగా ఏక్ పేడ్ మాకే నామ్ (అమ్మ పేరుతో ఒక మొక్క) కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంతో పాటు వడూర్, కుమారి, కుప్టి, వాంకిడి, రోల్‌మామడ, దేవుల్‌నాయక్ తండా, గుత్పాల గ్రామాల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సాబ్లే సంతోష్ సింగ్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

తలమడుగు: అన్ని గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని సుంకిడి గ్రామంలో చేపడుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో వర్షపు నీరు, మురికి నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ప్రతీ గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, గ్రామపంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: వసతి గృహాల్లో ఉండే విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఇంద్రవెల్లి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోస్ట్‌మెట్రిక్ బాలికల వసతి గృహంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డెన్ యశోద, వైద్య సిబ్బంది శ్రీనివాస్, సుశీల, కవిత, తదితరులు పాల్గొన్నారు.

‘ప్రజాపాలన ఓర్వలేకే విమర్శలు’



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి

కైలాస్‌నగర్: అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలను చేపట్టారని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. శుక్రవారం ప్రజాసేవభవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఏఐసీసీ నాయకుడు రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ఐదు గ్యారంటీలను పకడ్బందీగా అమలు చేస్తున్నట్లుగా తెలిపారు. ఆగస్టు 15లోగా రైతుభరోసా అందించేలా, ఎన్ని ఎకరాలకు అందించాలనే దానిపై రైతుల నుంచి అభిప్రాయాలను స్వీకరిస్తున్నామన్నారు. ప్రజాపాలన పేరుతో సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు చేరువవుతున్నారని, ఇది ఓర్వలేకనే బీఆర్ఎస్ తప్పుడు ఆరోపణలు చేస్తుందని మండిపడ్డారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి నిధులు ఇవ్వాలని, ప్రభుత్వం వారికి సహకరించడానికి సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, నాయకులు కలాల్ శ్రీనివాస్, నగేశ్, రూపేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

బోథ్: మండలంలోని మర్లపెల్లి, నక్కలవాడ మధ్యలోనున్న వంతెన వద్ద మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ కావడంతో అధికారులు స్పందించిరు. గురువారం భగీరథ ‘పైపు లైన్ లీకేజీ’ శీర్షికన సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి మిషన్ భగీరథ అధికారులు స్పందించి మరమ్మతులు చేయించారు. పైపులైన్ లీకేజీ వద్ద వాల్ ఊడిపోవడంతో సరి చేశారు.

పరామర్శ



పరామర్శిస్తున్న జోగు రామన్న

ఎదులాపురం: కుటుంబసభ్యుడిని కోల్పోయిన పలు కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న శుక్రవారం పరామర్శించారు. పట్టణంలో భుక్తాపూర్‌లో నివాసం ఉంటున్న ఏఎస్ఐ యూనిస్ ఖాన్ హఠాన్మరణం పొందగా ఆయన కుటుంబీకులను పరామర్శించి, కారణాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఖుర్షీద్‌నగర్‌కు చెందిన అబ్దుల్ రబ్ చౌస్, కేఆర్‌కే కాలనీలో ఇంటర్మీడియెట్ విద్యార్థి బుష్రా ఇటీవల మృతి చెందగా వారి కుటుంబసభ్యులను కలిసి పరామర్శించారు.

పూరిజగన్నాథ్ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

నేరడిగొండ: ఒడిస్సాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పూరి జగన్నాథ్ ఆలయాన్ని శుక్రవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారులు కుటుంబ సభ్యులకు తీర్థప్రసాదాలు అందించారు.

స్టాక్ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



తనిఖీ చేస్తున్న వ్యవసాధికారి భగత్ రమేశ్

బోథ్: విత్తన, ఎరువుల దుకాణదారులు వారి వద్ద ఉన్న స్టాక్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేసిన తరువాతనే విక్రయించాలని మండల వ్యవసాయాధికారి భగత్ రమేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని పలు విత్తన ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా కోరమాండల్‌లో ఎరువులకు సంబంధించిన పీసీలను ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడంతో, వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసిన తరువాతనే విక్రయించాలని సూచించారు. ఆయన వెంట వ్యవసాయ విస్తరణ అధికారి జక్క సంతోశ్, తదితరులు ఉన్నారు.

అధికారిక లాంఛనాలతో ఏఎస్ఐ అంత్యక్రియలు

ఆదిలాబాద్‌టౌన్: హైదరాబాద్‌లో సీఐడీ విభాగంలో ఏఎస్సైగా పని చేస్తున్న ఆదిలాబాద్ పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన యూనుస్ ఖాన్ హైదరాబాద్ సెట్విన్ బస్సులో గుండెపోటుతో మృతి గురువారం మృతి చెందారు. కాగా అర్ధరాత్రి ఆయన భౌతికకాయం ఆదిలాబాద్‌కు తీసుకొచ్చారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని ఈద్గా శ్మశాన వాటికలో అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. మూడు రౌండ్లు గాలిలో కాల్పులు జరిపి నివాళులర్పించారు. ఇందులో హైదరాబాద్ సీఐడీ ఎస్పీ భుక్యా రాంరెడ్డి, జిల్లా ఎస్పీ గౌష్ ఆలం, డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

ముథోల్ : ముథోల్, బాసర మండలాల్లోని ఆయా గ్రామాల లబ్ధిదారులకు శుక్రవారం ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ విఠల్, ఆర్ఐ నారాయణ, ఎంపీడీవో రాములు నాయక్, ఏపీవో శిరీష, బీజేపీ మండల అధ్యక్షుడు కోరి పోతన్న, మాజీ జెడ్పీటీసీ లక్ష్మీ నర్సాగౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ సుదర్శన్, మాజీ ఎంపీటీసీలు భూమేశ్, లక్ష్మీ నారాయణ, నాయకులు తాటివార్ రమేశ్, సతీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

సేవకులను గుర్తించడం అభినందనీయం

భైంసాటౌన్: సమాజ సేవకులను గుర్తించి డాక్టరేట్‌తో సన్మానించడం అభినందనీయమని ఎమ్మెల్యే పి.రామారావ్ పటేల్ అన్నారు. కుభీర్ మండలానికి చెందిన సమాజ సేవకుడు, సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ మండల చైర్మన్ సావ పండరికి ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ(బెంగళూరు) ఇటీవల డాక్టరేట్ పట్టాతో సన్మానించింది. శుక్రవారం పట్టణంలోని ఎస్ఎస్ కాటన్‌లో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు.

నూతన కార్యవర్గం

ఖానాపూర్: పట్టణంలోని తిమ్మాపూర్ పద్మశాలి సంఘం పరిధిలోని పద్మావతినగర్ పంథా నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నడిమెట్ల రమేశ్, ఉపాధ్యక్షుడిగా కుందారపు రాజేశ్, ప్రధాన కార్యదర్శిగా వేముల నాగరాజు, కోశాధికారిగా వెన్నం అంజయ్య, ప్రచార కార్యదర్శిగా నడిమెట్ల రాజేందర్ ఎన్నికయ్యారు.

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రాంనగర్ విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. ఇందులో గౌరవ అధ్యక్షుడిగా కంచారి రాంకిషన్, అధ్యక్షుడిగా భీమా చారి, ప్రధాన కార్యదర్శిగా గుండోజి రమేశ్, కోశాధికారిగా తాటికొండ శివకుమార్ ఎన్నికయ్యారు.